# కంప్యూటర్ వ్రతము

ద్వివేదుల సోమనాథశాస్త్రి



విజయదశమి రోజున సరస్వతీపూజ చేయడం విశ్వనాధంగారికి అలవాటు. ఎందుకంటే అక్షరాన్ని నమ్మకున్నవాడతను. అక్షరాన్ని అమ్ముకున్న వాళ్ళే యిప్పుడెక్కువయ్యారు! అది వేరే విషయం. నమ్మకున్నా, . అమ్ముకున్నా సరస్వతీ దేవి అనుగ్రహం కావాలి కదా!

ఆ ముందు రోజే పూజకు కావలసిన పళ్లూ, ఫలాలు, పువ్వులూ యిత్యాది సామగ్రి అంతా తెచ్చి సిద్దం చేసి వుంచారు. ఉదయాన్నే డిగ్రీ చదువుతున్న అమ్మాయినీ, కంప్యూటర్ కోర్స్ చదువుతున్న అబ్బాయినీ పిలిచి "స్నానాలు చేసి మీ మీ పుస్తకాలు తెచ్చుకుని రండి" సరస్వతీ పూజ చేద్దాం!" అని చెప్పారు.

దానికి వాళ్ళిద్దరూ "యీరోజుల్లో పుస్తకాలూ, పెన్నులూ పెట్టి సరస్వతీ పూజ చేయడం ఏమిటి నాన్నగారూ? మీ ఛాదస్తంగాని... మన కంప్యూటరూ, ప్రింటరూ, ఫ్లాపీలు, సీడీరాంలూ, మౌస్ పెట్టి పూజ చేద్దాం!" అని ఏకగ్రీవంగా అన్నారు.

అదివిని అవాక్కయ్యారు విశ్వనాధం గారు.

"పోనీలెండి! అది మాత్రం విద్యకాదా! యిప్పుడందరూ అదేగా చదువుతున్నది! ఆ పూజే చేయండి!" అని విశ్వనాధం భార్య ఒత్తాసు పలికింది. పూజకు అన్నీ సమకూరుస్తూ.

సరే యీ కంప్యూటర్ యుగంలో అలా చేస్తేనే సబబుగా వుంటుంది! వారి మాట కాదనడం ఎందుకు? సరే అవన్నీ పెట్టండి!" అన్నారు.

ఒక టేబిల్ మీద కంప్యూటరూ, డిస్కులూ, ఫ్లాపీలూ, సి.డి.రాంలూ, కీ బోర్డు పడేసి కేజీల బరువున్న కంప్యూటర్ పుస్తకాలూ తెచ్చి పెట్టారు. పూజలూ, గీజలూ ఏమిటి? యీ రోజుల్లో - మేం చెయ్యం అనకుండా ఒప్పుకోవడమే మహద్భాగ్యం అని అనుకొని విశ్వనాధం గారు -

"ఒరే అంతా మీ యిష్టమే గాని ఒక్క భగవద్గీత మాత్రం పెట్టుకోనివ్వండిరా!" అని

వేడుకున్నట్టు అడిగారు.

"అలాగే పెట్టుకోండి నాన్నగారూ!" అని అంగీకరించారు పిల్లలు.

కంప్యూటర్ కోర్సులో, ఎం.బి.ఎం, జావా, మొదలయిన వాటన్నింటినీ ఔపోసన పట్టిన కంప్యూటర్ ఘనపాటిని రప్పించి పూజ మొదలెట్టారు.

"అందరూ బొట్టు పెట్టుకోండి"

...................

"దీపం వెలిగించండి"

...................

ఉద్ధరణితో నీరు చేతిలో పోసుకుని ఆచమనం చేయండి... ఓం...."

ఒక్కసారి కంప్యూటర్ని కనిబెట్టిన పితామహుడు... 'ఛార్లెస్ బాబ్బేజ్' పేరు తల్చుకుని... నమస్కారం చేయండి!

"ఛార్లెస్ బాబ్బేజాయనమః"

మొదట... కంప్యూటర్లో, మన ప్రోగాములకు, ఫ్లాపీలకు, వెబ్‌సైట్లకు ఏవిధమయిన వైరస్‌లూ సోకకుండా గణపతి పూజ చేద్దాం. ఆ పసుపు గణపతిని పూజించండి.

"శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్

ప్రసన్న వదనం ధ్యాయే త్సర్వ విఘ్నోపశాంతయే!"

ఇంక కంప్యూటర్ వ్రతం ప్రారంభిద్దాం....

ఏవం గుణ విశేషణ విశిష్టాయాం శుభ తిథౌమమ వివిధ సాంకేతిక విద్యాఫల సిద్ధ్యర్థం, సకల విద్యాపారంగతత్వ సిద్ధ్యర్థంచ, వర్షేవర్షే ప్రయుక్త శ్రీకంప్యూటర్‌దేవీ ముద్దిశ్య శ్రీకంప్యూటర్ దేవతాప్రీత్యర్థం కల్పోక్త ప్రకారేణ యావచ్ఛక్తి ధ్యానావాహనాది షోడశోపచార పూజాం కరిష్యే.

**బుద్ధిమారదా?**

గోవిందా కెరీర్ పూర్తిగా నాశనమైనప్పటికీ అతని ధోరణిలో మాత్రం మార్పులేదు. ప్రస్తుతానికి అతను చేస్తున్న ఒకే ఒక సినిమా 'హమ్‌దో హమారా ఏక్' షూటింగ్‌లకు లేటుగా వచ్చి నిర్మాతలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడట. దీనితో గోవిందాను సినిమాల్లో బుక్ చేసుకోవడానికే నిర్మాతలు భయపడుతున్నారు.



అందరూ ఆచమనం చేయండి.

"అత్రాగచ్ఛ జగద్వంద్యే సర్వలోకైక పూజితే మమాకృతే కంప్యూటర్ మహాశక్తీ జగత్వ్యాపీ ఆవాహయామి".

సన్‌మైకా విరాజిత టేకు కలప నిర్మిత టేబిలాసనం సమర్పయామి

ఆంగ్లే యాక్షర సమన్విత్ విశేషక్రియా నిర్వాహితే కీ బోర్డు సమర్పయామి

భక్తాభీష్ట ప్రదే, కృషిప్రియే, జగద్ధాత్రి విశ్వరూపే మౌసీ సమర్పయామి

చతుస్సాకార రూపే సమాచార ప్రకాశే-ఫ్లాపీ సమర్పయామి

స్టీరియో స్పీకర్ అలంకృతే విండోస్ ప్రదర్శిత్ సీడీరాం సమర్పయామి

దృశ్యదర్శని తత్‌ప్రింటౌట్ ప్రసాదితేడెస్క్ ద్వయం సమర్పయామి

టచ్‌స్క్రీన్ సమాయుక్తాం ఆటోమేటిక్ అంతర్ధాన శక్తియుతం పాస్‌వర్డ్ సమర్పయామి

ధవళ, బిస్కట్, గ్రే, యిత్యాది సుందర వర్ణస్వరూపే బ్రౌజర్ సమర్పయామి.

వాణి బ్రహ్మణి, శబ్ద బ్రహ్మాత్మికే దేవి శబ్ద శాస్త్ర కృతాలయే కంప్యూటర్ విద్యార్థి పూజితే శతకోటి నమస్కారం సమర్పయామి

లక్ష్యసాధన దీక్షా ప్రసాదిని వరదే దేవి వందనం సమర్పయామి

"మమ" అనుకొని యీ విధంగా -

HTPP.WWW కంప్యూటర్@డాట్‌కాం..

అని స్మరించుకోండి.

పుష్పై పూజయామి అథాంగపూజా

"నమః' అన్నప్పుడల్లా పుష్పాలతో పూజ చేయండి -

ఓం ఛార్లెస్ బాబ్జేజాయనమః కంప్యూటర్ పూజయామి

ఓం బిల్‌గేట్సాయనమః విండోస్ పూజయామి

ఓం భోగదాయైనమః కీ బోర్డు పూజయామి

ఓం మహాశ్రయాయైనమః మదర్ బోర్డు పూజయామి

ఓం మహావిద్యాయైనమః స్కానర్ పూజయామి

ఓం వరప్రదాయైనమః వెబ్‌కెమారా పూజయామి

ఓం జ్ఞానముద్రాయైనమః మోడెమ్ పూజయామి


ఓం మహామాయైనమః సర్వ ఫ్లాపీడ్రైవ్ పూజయామి

ఓం విద్యారూపాయైనమః మౌస్ పూజయామి

ఓం సర్వ పూజితాయైనమః సర్వాణ్యంగాని పూజయామి.

ఈ విధంగానే నామ పూజ కూడా చేయండి.

ఓం సి.డి. రామాయమనమః, ఓం ఫ్లాపీయాయైనమః, ఓం బ్రౌజరాయైనమః, ఓం జియోసైటాయైనమః, ఓం యాహూసైటాయనమః, ఓం ప్రింటరాయైనమః, ఓం హార్డ్వేరాయనమః, ఓం సాఫ్ట్వేరాయనమః, ఓం ఈమైలాయైనమః, ఓం డి.టి.పి ప్రదాయైనమః, ఓం ఇంటర్నెట్టాయనమః, ఓం సర్వవందితాయైనమః,



నామ పూజాం సమర్పయామి.

అనేకాంగం- మనోహరరూపం దీపం దర్శయామి

ఆడియో-వీడియో సంయుక్తాం ధూపం సమర్పయామి

దృశ్య, శ్రవణ రంజితం నైవేద్యం సమర్పయామి

అనేక చిత్రవిచిత్ర విశేష ప్రదర్శిని తాంబూలం సమర్పయామి

తాంబూలంతో మీ మీ మౌస్‌ల నుంచి దక్షిణగా సమర్పించండి.

జగదానంద దాయినే విద్యాసంస్కారిణీ, సాంకేతిక విద్యాప్రదాయినీ కంప్యూటర్ మహాశక్తీ నమోనమః - నీరాజనం సమర్పయామి.

కర్పూరం వెలిగించి హారతి యిచ్చి అందరూ తీసుకోండి.

కంప్యూటర్ మహాదేవీ, విశ్వవ్యాప్తే అమెరికా ఉద్యోగాభీష్ట ప్రదాయినీ పుష్పాంజలి సమర్పయామి.

యా గణిత సులభా, యాలోకదర్శనీ, ఆనంద పులకిత శృంగారభాషణా (చాట్) ప్రదాయినీ, నీలిచిత్ర ప్రదర్శినీ, ఈమెయిల్, వెబ్‌సైట్ లబ్ధిదాయిని శ్రీఘ్ర సమాచారప్రసారిణీ, ఏనిమేషన్‌రూపశిల్పి, సదా పూజితా స్వామాంపాతు కంప్యూటరీ నిశ్శేష జాడ్యాపహా మంత్ర పుష్పం సమర్పయామి.

పాహిపాహి జగత్ వ్యాపీ నమస్తే భక్త వత్సలే నమస్తుభ్యం, నమస్తుభ్యం నమస్తుభ్యం నమోనమః

చతుర్దశ ప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి

అందరూ లేచి మూడుసార్లు ప్రదక్షిణ నమస్కారాలు చేయండి. మీమీ కోర్కెలను మనసులో తలుచుకొని, ప్రార్థన చేసుకోండి.



## మనసారా నవ్వుకుంటున్నాం!

విజయదశమి పండగ!
విజయుడు
విజయం సాధించిన పండగ!
రఘుముని పండగ!
రావణుని పదితలలు నరికి
తాపసులను, సజ్జనులను
కాపాడి లోకాలకు మేలు చేసిన
మరుపురాని పండగ!
అదే విజయదశమి!
అనాడే!
రాజులు - రారాజులు
ఎన్నెన్నో ప్రాతి పదికలు చేసి
విజయం సాధించి
విజయ పతాకం ఎగిరివేశారు
' ఇది!
ఆనాడు జరిగిన అక్షర సత్యం!
ఈనాడు సామాన్యులమైన మనం!
ఏవేవో కార్యక్రమాలు మొదలుపెట్టి
విజయం సాధిస్తూ!
నాటి సంప్రదాయాలు
ఆనాటి గాథలు
గాథలుగా చెప్పుకుంటూ
శమీ వృక్ష నీడల్లో
మనసారా నవ్వుకుంటున్నాం

- కె. మధుసూదన్

మీమీ వెబ్‌సైట్లను ఓపెన్ చేసుకొని చూసుకోండి. లాబ్‌టాప్‌లుంటే మరీ మంచిది. వాటిల్లో HTPP.WWW డాట్‌కామ్ కొట్టి మీ పాస్ వర్డ్ టైప్ చేసి ఇంటర్నెట్‌లోకి వెళ్ళి ప్రార్థన చేయండి.

మనోహరాకృతాం స్క్రీన్, స్పీకర్, ప్రింటర్, బ్రౌజర్, కీబోర్డ్, ఫ్లాపీడ్రైవ్ సిడీరాం డిస్క్, మౌస్ యిత్యాది సర్వ లక్షణ సమన్వితామ్ నమస్తుభ్యం వరదే భక్త వత్సలే కంప్యూటరీం నమస్తే నమః

అందరూ కంప్యూటర్‌కి సాష్టాంగ ప్రణామం చేసి అక్షింతలూ పూలు చేత్తో పట్టుకుని శ్రద్ధగా కథ వినండి -

"ఎంత చదివినా, ఎన్ని డిగ్రీలు సంపాదించినా ఉద్యోగాలు దొరక్క బాధపడుతున్న యువతీ యువకులు సరస్వతీ దేవితో తమ యిక్కట్లను మొరపెట్టుకోగా సాక్షాత్తు ఆ సరస్వతీ దేవి ఆ యువతీ యువకులను చూసి యిట్లనియె-


"నిరుద్యోగ యువతీ యువకుల్లారా? నిరాశ చెందకండి. కంప్యూటర్ వ్రతమును నూతన పూజా విధానమును మీకు ఉపదేశించెదను శ్రద్ధా భక్తులతో విని, అద్దానిని యథావిధిగా ఆచరించిన తప్పక మీ కోర్కెలీడేర గలవు!"


అనిన ఆ విద్యార్థులు "అమ్మా అట్టి కంప్యూటర్ వ్రతమును ఆచరించు విధమెట్టిదో తెలిపి తరింపజేయుము" అని అడుగగా

"ఈ వ్రతమునకు కంప్యూటర్, స్పీకర్, ప్రింటరు, కీ బోర్డు, మౌస్, బ్రౌజర్ మొదలైన సామగ్రి ఏ కంప్యూటర్ షాపులలోనయినను కొని తెచ్చుకొనవలయును. దానికి కావలసిన పుస్తకములు కూడా లభ్యమగును. కంప్యూటర్ శిక్షణా కేంద్రములలో నేర్చుకొనవలయును. ఎబిఎమ్ ఒరాకిల్ జావా మొదలయిన ఎన్నో కోర్స్ లున్నవి. యివి రోజురోజుకూ మారిపోవచ్చును. వాటిపై దృష్టి వుంచి మార్పులకు తగిన విధముగా అభ్యసించవలయును. అట్లు చేసిన ఉత్తమ సాఫ్ట్ వేర్ ఇంజనీరులయి అమెరికాలో ఉద్యోగార్హతను పొందెదరు" అని చెప్పగా విని -

"తల్లీ తొల్లి యీ విద్యనెవ్వరభ్యసించి, యీ వ్రతమును ఎవ్వరాచరించి ధనవస్తు వాహనాది సౌకర్యములతో సుఖంబుచెందిరి?" అని అడగగా

ఆ విద్యల దేవి - "విద్యార్థులారా! యీ భూమండలమునందు పశ్చిమ దిశయందు అమెరికాయను గొప్పదేశము కలదు. ఆ దేశము సర్వశోభితమై రాజ్యములలోకెల్ల అగ్ర రాజ్యమై





**వివేక్ తిప్పలు**

రామ్‌గోపాల్‌వర్మ లేటెస్ట్ హీరో వివేక్ ఒబెరాయ్ త్వరలో గుర్‌ప్రీత్‌ను వివాహం చేసుకోబోతున్నాడు. అంతకు ముందుగా ఒక ఇంటిని కొనాలనే ఉద్దేశ్యంతో బిల్డర్ వద్దకు వెళ్ళాడట. వివేక్ 'హీరోని కాబట్టి నాకు ఇల్లు తక్కువకు అమ్మినట్లయితే, నీకు మంచి బిజినెస్ ఉంటుందని' బిల్డర్‌తో అన్నాడట. దీనితో ఆ బిల్డర్ ఒళ్ళు మండి బయటకు వెళ్ళడానికి దారి చూపించాడట.

విరాజిల్లు చున్నది. అందలి ప్రజలు బహు సుందరరూపులై వుందురు. తమ విద్యుక్త ధర్మములను, క్రమశిక్షణతోనూ, బాధ్యతతోనూ చేయుదురు. అందువలన అచ్చటి ప్రజలు నిత్యైశ్వర్య సంపన్నులు. ప్రభుత్వమునకు చెందవలసిన "పన్ను"లను ఎగవేయువారు కాదు. అందువలన ప్రభుత్వము కూడా ఆదర్శప్రాయముగ నడుచుచున్నది. దేశము శుభిక్షముగానున్నది. ఆదేశము, వాయు, నౌక, సేనలతోనూ, పటిష్టమయిన సైనిక బలముతోనూ, అణ్వాయుధ, లేజరాయుధ యిత్యాది అత్యంతాధునిక మారణాయుధ సమన్వితమై సాంకేతిక పరిజ్ఞాన సంచితమయి అనన్యసామాన్యమయి ఒప్పుచున్నది. అట్టి దేశమున కంప్యూటరనెడి మహత్ పరికరమును ఛార్లెస్ బాబ్బేజ్ అనునతడు కనుంగొనెను.

ఆ తరువాత "బిల్‌గేట్స్" అను మహానుభావుడు యధావిధిగా యీ వ్రతంబు ఆచరించి ఎన్నో నూతనాంశములను సృష్టించి యావత్ ప్రపంచములోనే అధిక ధనవంతుడాయెను" అని చెప్పగా ఆ యువతీ యువకులు-

"మాతా! అట్టివారు మనదేశమున కూడా గలరా? ఉన్నచో వారే విధముగ యీ వ్రతము నాచరించి ధన్యులయినారో తెలుప ప్రార్థన" అని వేడుకొనిరి

అంతనా వాగ్దేవి యిట్లనియె-

"బిడ్డలారా! కర్మభూమి అయిన భారత ఖండమ్మున అట్టి భక్తులకు కొదవేముండును? ఆ దేశమున ఆంధ్రదేశమను రాష్ట్రం కలదు. నారా చంద్రబాబునాయుడను భక్తాగ్రేసరుడు ఆ రాష్ట్రమునకు ముఖ్యమంత్రి పదవినలంకరించి అనతికాలములోనే కంప్యూటరు వ్రతము నాచరించి షోడశోపచారములతో పూజించెను. ఆ ప్రభావము వలన హైదరాబాదు, సికిందరాబాదు నగరములకు తోడు సైబరాబాదను మరొక కంప్యూటర్ నగరమును నిర్మించెను. దానిని హైటెక్ సిటీ అని కూడా పిలుతురు. ఆంధ్ర ప్రదేశమునందంతయూ సైబర్ కేఫ్‌లను నెలకొల్పి కంప్యూటర్ సేవలను విస్తరింపజేసెను. వీడియో కాన్ఫరెన్సులు చేపట్టెను. కార్యకలాపములను కంప్యూటర్ ద్వారా నెరవేర్చుచున్నాడు. అనేకమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తయారగుటకు కారణభూతుడాయెను. అందువలననే నేడు అమెరికాలో పనిచేయుచున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులలో ఎక్కువ శాతము ఆంధ్రులే అనుటకు సందేహం లేదు.

ఆ విధముగనే కర్నాటక రాష్ట్రములో కూడా టి.కృష్ణ అను ముఖ్యమంత్రి కంప్యూటర్ మాతను పూజించి ఆ వ్రతమును ఆచరించి బెంగుళూరును "సిలికాన్ వేలీ" క్రింద తీర్చిదిద్దెను. వీరిని ఆదర్శముగా తీసుకొని మిగతా రాష్ట్రములు కూడా కంప్యూటర్ వ్రతములు చేయుచున్నారు. వీరేగాక, సత్యం కంప్యూటర్ అధిపతి, విప్రో కంప్యూటర్ అధిపతి, ఇంటిల్ మొదలుగా గల కంప్యూటర్ భక్తులు కంప్యూటర్ మహాశక్తిని పూజించి తరించుచున్నారు.

ఈ విధముగా ఆశ్వయుజమాస శుక్లపక్షపాడ్యమి మొదలుకొని తొమ్మిది దినములు పూజించవలయును. లేనిచో అష్టమి, నవమి, దశమి యీ మూడు దినములయినను చేయవలెను. అట్లు చేయుటకూ అశక్తులయ్యేనేని దశమి నాడు ఒక్కదినమయినను పూజించవలయును. యీ వ్రతంబాచరించువారు యిహలోకమున నిరంతరైశ్వర్య సంపన్నులై పునర్జన్మంబున నిరుద్యోగ క్లేసము నుండి విముక్తులగుదురు.

కావున నీ వ్రతమును జాతి, మత, కుల, దేశ, లింగ విచక్షణ లేక ఎవ్వరయినను చేయందగును. యీ వ్రతమును చేయువారును, చూచువారును, యీ కథను వినువారును, పఠించువారును సకల పాప విముక్తులయి యీ జన్మమందు నిరుద్యోగ బాధనుండి విముక్తులయి, అమెరికా, ఇంగ్లాండు దేశములలో ఉద్యోగములను పొంది, లక్షలాది డాలర్లు సంపాదించి యిహలోకమున సర్వ సుఖములననుభవించి పిదప ఆ దేశములలోనే స్థిర నివాసమేర్పరుచుకొందురుగాక.

ఇతిః శ్రీకంప్యూటర్ వ్రతకల్పః సంపూర్ణః

విశ్వనాథం, అతని భార్య, పిల్లలూ లేచి పువ్వులూ, అక్షింతలూ తీసుకొని కంప్యూటర్ మీద వేసి నమస్కరించారు. తరువాత కంప్యూటర్ పండితునికి దక్షిణ తాంబూలాలిచ్చి నమస్కరించారు.

"కంప్యూటర్ విద్యాసిద్ధిరస్తు! అమెరికా దేశ ఉద్యోగప్రాప్తిరస్తు! ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిరస్తు"! అని దీవించారు.

